ఫిబ్రవరి 5, మాఘ పూర్ణిమ

ఫిబ్రవరి 2023

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక


రక్త సంబంధిత సమస్యలకు
**నివారణోపాయము**

గుర్రాలక్క గుడి
**శ్రీవిద్యా మందిరాలు**



## శ్రీ లక్ష్మీ దేవి ఉపాసన

**శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్యోక్త పంచదశీ యుక్త బీజ సంపుటిత శ్రీ సూక్త విధానం**



# శ్రీ గురు ధ్యానం

**వందే గురు పదద్వంద్వం అవాఙ్మానస గోచరం**
**రక్త శుక్ల ప్రభా మిశ్రం అతర్క్యం త్రైపురం మహః**

మనో వాక్కాయ కర్మలకు గోచరం కాని శక్తి కలిగియున్న;
ఎరుపు వర్ణంలో ఉండి , త్యాగము మరియు ప్రేమ తత్వాలను సూచించే స్త్రీ శక్తి మరియు
శుక్ల వర్ణములో ఉండి, స్థిరమైన మనస్తత్వాన్ని సూచించే పురుష శక్తులకు నిదర్శనమై యున్న;
తర్కించుటకు సాధ్యము కాని;
ముల్లోకములలో ఎవరూ వివరించలేని శక్తి కలిగి యున్న
గురు పద ద్వయమునకు నమస్కారములు.

# గురువాణి

విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -1 సంచిక - 6, ఫిబ్రవరి 2023

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రిక ను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter | Follow on Facebook | Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**
(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I,
Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

**ఈ సంచికలో** — **పేజీ**

**కవర్ పేజీ చిత్రము**
శ్రీ మహా లక్ష్మి

**ధ్యానం**
శ్రీ గురు ధ్యానం 02

**గురువాణి**
సాధనా రహస్యాలు 04

**శ్రీవిద్యా సాధన**
పంచదశీ యుక్త బీజ సంపుటిత శ్రీ సూక్త విధానం 08

**శ్రీవిద్యా మందిరాలు**
అశ్వరూఢాంబికా అమ్మ వారి ఆలయం 10


**నివారణోపాయములు** 13

**జరిగిన కార్యక్రమాలు** 14

**రాబోయే కార్యక్రమాలు** 15

**సాధకుల అనుభవాలు** 17

**ప్రశ్నలు – సమాధానములు** 19



# గురువాణి

గురూజీ సందేశము

# సాధనా రహస్యాలు

## శ్రీ గురు కరుణామయ

(గురూజీ ప్రవచనాల నుండి)

గురువులు ఏ రూపములో ఉన్నా మనలను ఉద్ధరించటమే వారి పరమ కర్తవ్యముగా భావిస్తారు.దాని కోసము వారు చేసుకున్న తపస్సు లో కొంత భాగము మనకు ధార పోసి మన వెనుక ఉండి మనలను నడిపిస్తారు. అలా మన వెన్నంటి ఉండి నడిపించే వాడు భగవంతుడు. కనుక

గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వరః

అన్నారు. అలాంటి గురువు మార్గ దర్శకత్వంలో సాధన చేసి తరించగలగటము ఒక భాగ్యము. ఆ సాధన రహస్యాలు వారి నుండి తెలుసుకుంటూ నిత్య జీవితం సాగించటము ఆధ్యాత్మిక జీవనానికి చాలా అవసరము. సాధనా రహస్యాలు అంటే ఒక జీవిత కాలములో మనిషి చెయ్యదగిన సాధన. ఈ విషయము ఏ కొద్ది సమయములోనో వివరించగలగటము అనేది కూడా ఒక సాధన. అది అమ్మవారు పలికించే రహస్యమే.

భగవదనుభూతి కోసము చేసే ధ్యానము నిలబడే ధ్యానము అయ్యి ఉండాలి. తడబడేలా ఉండ కూడదు. సాధారణముగా ఓంకారాన్ని ఉపాధిగా చేసుకుని నిశ్చలమైన ధ్యానముతో లయమైపోతుంటారు. తప్పులేదు. అలాంటి ధ్యానము నిలబడాలి అంటే వారికి ఓంకారం ఎప్పుడూ ఉండాలి. కానీ అది అన్ని వేళలా సాధ్యము కాదు కదా! కనుక మనకి ఉపాధి రహిత సాధన అవసరము అనేది మొదటి రహస్యము.

కనులు మూసుకుని నేర్చుకున్న ధ్యానము కనులు తెరిచి ఉన్నప్పుడు కూడా చెయ్యగలగాలి. ఎలాగైతే ఒక పిచ్చుక తన గూడు నిర్మించుకోవటానికి ఒక్కొక్క గడ్డి పోచను సేకరించి తెచ్చుకుంటుందో అలాగే మానవుడు ఉపాధి ని ఆసరాగా చేసుకుని పొందే ధ్యాన స్థితి మరియు అనుభవాలను తనలో ఒక్కొక్కటిగా నిక్షిప్తము చేసుకోవాలి. తద్వారా కొంత కాలానికి ఉపాధి రహిత ధ్యానము చెయ్యగలిగే స్థితికి చేరుతాడు. తన జీవితమే ఒక ప్రార్థన గా మార్చుకున్న మానవునికి తన దేహము దేవాలయము అవ్వగలదు.

దేహో దేవాలయ ప్రోక్త జీవో దేవః సనాతనః!

దేహమే దేవాలయం. అక్కడ ఉన్న జీవుడే దేవుడు అన్న ఆర్యోక్తిలోని పరమార్థాన్ని అనుభవం లోకి తెచ్చేదే ధ్యానము. ధ్యానము కూడా ఏదో ఆశించే కదా చేస్తాము. దేహాన్ని సాధించటం కోసమా లేక పరమార్థాన్ని సాధించటం కోసమా అన్నది తెలుసుకోవాలి. పరమార్థము గోచరించటము అనేది పురాణాలలో పుస్తకాలలో వివరించినంత సులభము కాదు. మనకు గోచరించేది మన శరీరమే. కొన్ని ధర్మాలను నెరవేర్చటానికి ఇది మనకు భగవన్తుడు ప్రసాదించాడు. దీనిని చక్కగా పోషించటము ఒక సాధన.

# గురువాణి

## గురూజీ సందేశము

ఈ సాధన ఆహార వ్యవహార నియమాలతో ప్రారంభించాలి. అప్పుడు ధ్యానము సులభముగా కుదురుతుంది. ఆ ధ్యానములో ఒక స్థాయిని పొందినప్పుడు ఎక్కడ ఉన్నా ఎంతమందిలో ఉన్నా ఏమి చేస్తున్నా ధ్యానము కొనసాగుతూ ఉంటుంది. అలాంటి వారు భౌతిక ప్రపంచముతో వ్యవహరిస్తునే ఆంతరంగికముగా ధ్యాన స్తితిలో ఉంటారు.

ధ్యానము చేసే వారికి శాకాహార నియమము విధింపబడినది. ఆహారము కేవలము నోటితో గ్రహించేది మాత్రమే కాదు. నవ విధ యోనుల ద్వారా గ్రహించటము జరుగుతుంది. నోటితో గ్రహించేది సాత్విక ఆహారము అయి ఉండాలి. అలాగే చెవులతో సాత్వికమైన మాటలను వినాలి. అంటే ఆత్మ స్తుతి పర నిందలకు విముఖులమై ఉంటూ మంచి మాటలను, సూక్ష్మముగా చెప్పబడిన జీవిత తత్వాలను వినటానికి సుముఖులమై ఉండాలి. మన వాక్కులు సహితము మృదు మధుర సరళ గంభీరమై సాత్వికములై ఉండాలి. కేవలము సాత్విక ఆహారము సరిపోదు. అది మితముగానే ఉండాలి. మంచిదే అయినప్పటికీ ఆహారము మితముగానే స్వీకరించాలి.

ప్రియ ఆహార వర్జితమ్ అనేది మరొక నియమము. ఇష్టమైన ఆహారము అయినప్పటికీ దానిపై మోహము పనికి రాదు. పూర్తిగా విసర్జించటము అపజయముతో సమానము. ఇష్టమైన ఆహారమైనా తినరాదు అనుకున్నప్పుడు తినకుండా ఉండగలగటము నియంత్రణ సాధించటము. అది మోహం పై విజయము. దానిని సాధించాలి. కేవలము మనకు కావలసిన ఆహారము స్వీకరించి మిగిలినది ఆకలిగా ఉన్న వారికి పంచటము నేర్చుకోవాలి. అలా దాన గుణము అలవరచుకోవాలి. ఇవి సాధకుడు పాటించవలసిన ఆహార నియమములు.

ఇక వ్యవహార నియమములు. కనులు మూసుకుని చేసే ధ్యానములో కనిపించినది, అనుభవం లోనికి వచ్చింది మాత్రమే దైవము కాదు. ఆ ధ్యాన ఫలితముగా ఏర్పడిన విశేషమైన ఆత్మ జ్ఞానముచే బాహ్య ప్రపంచం లోని ప్రతి వ్యక్తిలోనూ, ప్రతి వస్తువులో ఆ భగవంతుని చూడ గలగడమే సాధన. ఆ వ్యక్తి తనను పొగిడినా, తిట్టినా, ఉపకారము చేసినా, తనను మోసగించినా అతనిలో భగవంతుని చూడగలగటం సాధన.

అలాగే మాట్లాడే ప్రతి మాట మంత్రము అని గుర్తు ఉంచుకోవాలి. అకారాది క్షకారాన్తము ప్రతి అక్షరము మంత్రమే. కనుక మంత్రాన్ని ఎంత భక్తి శ్రద్ధలతో పలుకుతామో అలాగే మనము మాట్లాడే ప్రతి మాట మంత్రము అని, మనము మాట్లాడుతున్న మన ఎదుటి వ్యక్తి దైవ స్వరూపమే అన్న భావంతో శ్రద్ధ గా మృదువుగా మధురముగా మాట్లాడాలి.

జిహ్వే రసజ్ఞే మధురత్వేత్వమ్ సత్యమ్ హితము త్వా పరమము వదామి! అవర్ణేదా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి!!

గోవిన్దా దామోదరా అని ఎంత మధురముగా పలుకుతావో నీవు పలికే ప్రతి అక్షరాన్ని అంత మధురముగా పలుకు అని శాస్త్రం చెబుతోంది. గురువులతో దైవముతో ఎంత భక్తి శ్రద్ధలతో వ్యవహరిస్తామో కుటుంబ సభ్యులతో అంత ప్రేమగా సామరస్యంగా మెలిగితే జీవితములో సమస్యలు అన్నవే రావు. నెలకి ఒకసారి గుడికి వెళ్ళమని చెప్పారు పెద్దలు. అలాగే నెలకి ఒకసారి అంధుల, మూగ, బధిరుల పాఠశాలలకు వెళ్ళాలి. అప్పుడు మనకు ప్రసాదింపబడిన అవయవాలని

సక్రమముగా అర్థవంతం గా వినియోగిస్తాము. ఆ ఎరుకని కలిగించే పైన చెప్పబడిన అన్ని ప్రదేశాలు దేవాలయాలే.

సూర్యోదయానికి పూర్వమే నిద్ర నించి లేవాలి. అది ఎలాంటి ఆలోచనలు మొదలు కాని సమయము. వెచ్చని సూర్య కిరణాలు పడే సమయము ధ్యానము చేయటానికి తగిన సమయము. ప్రతి రోజూ నిర్ణీత సమయములో తప్పకుండా ధ్యానము చెయ్యాలి అనేది నియమము. మొదటి రోజు ఓంకారం చేస్తూ ధ్యానము సాగించటము కష్టంగానే ఉంటుంది. మర్నాడు కొంత తేలిక పడి ఆ మర్నాటికి సులభముగా తోస్తుంది. ఇక ఆ పై నిత్యము ప్రతి క్షణము ఓంకారం మనసులో కదులుతూనే ఉంటుంది. అలా చేసే ధ్యానము మనకి విశేష ఫలితాలను ఇస్తుంది.

# గురువాణి

## గురూజీ సందేశము

ఒక చిన్న కథ రూపములో ఈ విషయము చక్కగా చెప్పబడినది. ఒక నాడు అక్బర్ చక్రవర్తి బీర్బల్ మరియు కొందరు పరివారముతో వేటకి వెళ్ళాడు. కొన సమయము తరువాత అక్బర్ మరియు బీర్బల్ అడవిలో దారి తప్పి ఆకలి బాధ పడ్డారు. అక్బర్ ఆహారముకై అన్వేషిద్దాము అంటే బీర్బల్ మాత్రము ఇది తనకు ధ్యానము చేసే సమయము కనుక తను ధ్యానము చెయ్యవలసిందే అని పట్టుబట్టి ధ్యానము చెయ్యటము ప్రారంభించాడు. అక్బర్ ఆకలి తట్టుకొలేక చుట్టు పక్కల వెతికి ఒక గుడిశ వద్దకి వెళ్లి తనకు ఆహారము కావాలి అని అడుగుతాడు. చక్రవర్తి స్వయముగా తమని ఆహారము కావాలి అని అడగటము తడవుగా వారు చక్కటి భోజనము తయారు చేసి ఇచ్చారు. అక్బర్ తాను తినటమే కాక బీర్బల్ కి కూడా ఆహారము తీసుకుని వచ్చాడు. ధ్యానము నించి బయటకు వచ్చిన బీర్బల్ తో కేవలము తన పురుష ప్రయత్నము మాత్రమే ఆహారము సంపాదించి పెట్టినదే కానీ నీ ధ్యానము ఆహరమును సాధించ లేదు అని ఎగతాళి చేసాడు అక్సర్. దానికి బీర్బల్ “రాజా! మీ పురుష ప్రయత్నము మీరు ఆహారము అభ్యర్థించేలా చేసినది. కానీ నా ధ్యానము నా కోసము చక్రవర్తి ఆహారాన్ని అభ్యర్థించి నాకు ప్రసాదించేలా చేసింది” అని చిరునవ్వుతో చెప్పాడు. అదీ ధ్యానము చెయ్యటము వలన కలిగే స్థితి.

ధ్యానము చేసే విధానం గురువులు ఉపదేశిస్తారు. కళ్ళు మూసుకుని స్థిరమైన ఆసనములో ఇతర చింతనలు లేకుండా నాదాన్ని వింటూ ధ్యానము చెయ్యాలి. కానీ మనసుకు ఏవేవో ఆలోచనలు వస్తూనే ఉంటాయి. వాటి నుంచి బయట పడటానికి స్వస్వరూప ధ్యానము చెయ్యటము చక్కని పరిష్కారము. మనకు ప్రత్యక్షముగా పరిచయము లేని భగవంతుని ఊహించి ధ్యానము చెయ్యటము కష్టమే. మన రూపము మనకు చిర పరిచయమే కదా! ఒకసారి మనలని మనం పరీక్షగా చూసుకోవాలి. కనులు మూసుకుని మన రూపాన్ని మన ముందుకు తెచ్చుకుని మన రూపాన్ని ధ్యానించాలి. నిజానికి ఇది చాల కష్టము అని గ్రహిస్తాము. దాని వలన కొన్త కాలానికి మనము ఒక నిర్ణయానికి రాగలము. మన రూపాన్నిమనము కనులు మూసుకుంటే ఎలా ఉంటుంది అని తెలుసుకుని నిలుపుకొనలేక పోతున్నాము. ఎదుటి వారి మనసులో ఏమి దాగి ఉన్నదో , అది తప్పో ఒప్పో మనము ఎలా నిర్ణయించగలము అనే ఆత్మ విశ్లేషణ ఏర్పడుతుంది. ప్రతి రోజూ ఉదయము నిద్ర లేవగానే నిశ్శబ్ద ధ్యానము, ఈ స్వస్వరూప ధ్యానము చెయ్యటము చాలా ఉపయోగకరము.

నిశ్శబ్ద ధ్యానము వలన బయట ఉన్న గోల తగ్గి లోపలి నాదము వినగలము. శబ్దానికి శబ్దానికి మధ్య ఉన్న నిశ్శబ్దాన్ని ధ్యానము చెయ్యాలి. శబ్దము గోపిక నిశ్శబ్దము గోవిందుడు. గోపిక ఎప్పుడూ గోవిందుని గురించి ధ్యానము చేసినట్లు శబ్దము వినపడుతున్నా దాని తరువాత వచ్చే నిశ్శబ్దాన్ని గుర్తించగలగాలి. విశుద్ధి చక్రములోని, పదహారు దళములు పదహారు వేల గోపికలు.వారందరు సహస్రారములో ఉన్న ఒక్కడైన గోవిందుని స్మరిస్తూ ఐక్యత పొంది ఉంటారు అదే నిరంతరము సాగే రాస లీల అని మార్మికముగా చెప్పబడ్డది.

అసలు ధ్యానము వీలైనంత చిన్న వయసులోనే మొదలు కావాలి. ఎటువంటి మలినములూ చేరని బుద్ధి అప్పుడు మాత్రమే ఉంటుంది. ఆ వయసులో తక్కువ సమయము చేసినా విశేష ఫలితాలు ఉంటాయి. ధ్యానము అవేది జీవితములో ఒక ముఖ్యమైన ఘట్టము అని వారికి ఆ వయసులోనే తెలియాలి. అలా అది వారికి తెలియాలి అంటే తల్లితండ్రులు ఆచరించాలి. కేవలము పూజ గదిలో చేసేది మాత్రమే కాదు ఇది కూడా సాధనే. తాము సాధించిన విజయాలకు గురువులు ఎలా కారకులో పిల్లలకు తెలియజేయాలి. జీవితంలో గురువు యొక్క ఆవశ్యకత వారు కూడా తెలుసుకొన గలుగుతారు.

కోటానుకోట్ల ప్రజలు స్వప్రయోజనాల కోసము జీవిస్తుంటే కేవలము లోక కళ్యాణానికి తమ జీవితాలు ధార పోసే గురువులు దొరికినపప్పుడు వారు భౌతికముగా లేకున్నా వారిని నిరంతరము మరచిపోకుండా గౌరవించుకోవాలి. గురువులు తమ శరీరము త్యజించినా చిరంజీవులై ఉంటారు. మన జీవితములో మనము ఉత్తమ వ్యక్తులుగా జీవించినప్పుడు ఆ గౌరవము మన గురువులకు దక్కుతుంది. శరీరము ఉన్నంత కాలము అరిషడ్వర్గాలు సహజమే అయినా అది స్థాయి మించకుండా అదుపులో ఉంచుకోవడం, మితి మీరిన ఆవేశ కావేశాలు తప్పు అన్న ఎరుక నేర్పేవారు గురువు. హద్దులు తెలుసుకుని ప్రవర్తిస్తాము. కనుక ఆ ఎరుక ఉన్నంత వరకూ మనము క్షేమముగా ఉండగలము. అది గురువు యొక్క అనుగ్రహము అని తెలుసుకోవాలి.

# గురువాణి

## గురూజీ సందేశము

ధ్యానము చెయ్యని వారి కంటే ధ్యానము చేసేవారు అత్యంత జాగరూకతతో బాధ్యత తో ప్రవర్తించాలి. "ఇన్ని గంటలు పూజలు, ధ్యానములు చేస్తూ బయటికి రాగానే ఈర్ష అసూయలు, కోపము, అహంకారము మొదలైన దుర్లక్షణాలతో పెద్దలు ఉంటున్నారు. వీరి పూజలు, ధ్యానము వీరిని మంచివారిగా మార్చలేక పోతున్నారు కనుక మనము ధ్యానము చెయ్యనవసరము లేదు" అని మన పిల్లలు భావించరాదు. కనుక మన ప్రవర్తన పిల్లలకు సాధన చెయ్యాలి అన్న స్ఫూర్తిని కలిగించే విధముగా ఉండాలి. సాధన చేసేవారు పాటించవలసిన మరి కొన్ని నియమములు

సత్యము, జ్ఞానము, అనన్తమ్ బ్రహ్మమ్.

ఎలాంటి పరిస్థితి కలిగినా సత్యమునే పలకాలి. ఆఫీసుకు శలవు పెట్టాలన్నా అసత్యాన్ని తేలికగా పలికే ఈ లోకములో ఆరు నూరు అయినా సత్యమునే పలకాలి అనేది అంత సామాన్యము అయిన విషయము కాదు. సత్యనారాయణ వ్రతము ఇదే విషయము బోధిస్తున్నది. సత్య నారాయణ అనే వ్రతము అనవరతమూ అనగా ఎల్లప్పుడూ ఆచరించాలి. అది ఏదో ఒకరోజు కలశము పెట్టుకుని ఆచరించి మిగిలిన రోజులు అసత్యాన్ని పలకటము కాదు. కనుక చేసే ప్రతి పూజ లేక వ్రతము యొక్క అంతర్గత సందేశాన్ని తెలుసుకొనుట ముఖ్యము.

సాధన ఏ ప్రయోజనాన్ని ఆశించి చేయాలో తెలుసుకొనుటే నిజమైన జ్ఞానము. సాధకుడు ముందుగా తనను తాను సాధించాలి. తనపై తనకు నియంత్రణ కలిగి ఉండాలి. తరువాత సమాజాన్ని సాధించాలి. తరతరాలకు చెరిగిపోని స్థానాన్ని సమాజ హితముగా చేసే సేవ కారణముగా సంపాదించుకోవాలి. తన జ్ఞానానికి కారణమైన గురువుని మనసులో నిలుపుకుని వారు ప్రసాదించిన విద్యను తన శక్తికొలది వ్యాప్తి చెయ్యాలి. తన శిష్యులు తనంత వారు కావాలి అని గురువు ఆశిస్తారు. అలా జరిగినపుడు గురువు చిరంజీవులు అవుతారు.

కేవలము హిమాలయాలకు వెళ్లి కాషాయ వస్త్రాలు ధరించి ఆత్మజ్ఞానము పొందిన వారు మాత్రమే గురువులు కారు. పాంచ భౌతికమైన శరీరాన్ని ధరించి కలుషితమైన ప్రపంచములో జీవిస్తూ కూడా ఎంతో ఉన్నతమైన జీవితాన్ని గడపవచ్చు అని తెలియజేసే వారు సద్గురువులు. జీవితములో సరళముగా ఏమి చెయ్యవచ్చు, ఏమి చేస్తే మనలోని భగవంతుడిని దర్శించవచ్చు అని తెలియజేసేవారు గురువులు.

మనము చేసే సాధన ఏ స్థాయిలో ఉన్నది అని మనంతట మనము తెలుసుకొనే మార్గము ఒకటి ఉన్నది. మనకు ఎదురయ్యే సంఘటనలకి మనము స్పందించే విధానము మన ఆధ్యాత్మిక స్థితిని తెలియజేస్తుంది. భయంకరమైన సంఘటనలు జరిగినప్పుడు మిగిలిన వారు ప్రతి ఘటిస్తున్న సమయములో మనము నిశ్చలముగా ఉన్నా, భౌతికమైన ఆనందాలు సౌకర్యాలు వచ్చి చేరుతున్నప్పుడు అత్యుత్సాహము ప్రదర్శించకుండా ఉన్నా మనము ఆధ్యాత్మిక ప్రయాణములో ఉన్నత స్థానము చేరుతున్నట్టు లెక్క.

సాధనలో మరికొన్ని ముఖ్యమైన నియమములు దానము, సేవ. అయాచితంగా లభించే ప్రాణావసరములకై ప్రకృతికి ఋణపడి ఉంటాము. తెలిసీ తెలియక తోటి వ్యక్తులకు ఋణపడి ఉంటాము. అవి పేరు పేరున తీర్చలేము కావున మనము సంపాదించే ధనములో పది శాతము, మనకు భగవంతుడు ఇచ్చిన ఆయుఃప్రమాణం లో పది శాతము సమాజ హితము కొరకు లేదా గురు సేవ కొరకు వినియోగించాలి.

నాన్య పంథా అయనాయ విద్యతే

ఈ జన్మలో చెయ్యకున్నా మరొక జన్మలో నైనా ఇది తప్ప నాకు వేరు మార్గము లేదు అనునట్లుగా సేవా భావాన్ని అలవర్చుకొని జీవితాన్ని గడపటము ఉత్తమ జీవన విధానము.

శ్రీ మాత్రే నమః

Guru Karunamaya


# సంపద మరియు శ్రేయస్సు పొందడం కోసం శక్తివంతమైన లక్ష్మీ దేవి ఉపాసన

శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్యోక్త పంచదశీ యుక్త బీజ సంపుటిత శ్రీ సూక్త విధానం



శ్రీ లక్ష్మీ దేవిని ఉపాసన చేసే పద్ధతులలో సంపుటిత శ్రీ సూక్త విధానము కూడా ఒకటి. శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య స్వామి వారు ఈ పద్ధతిలో ఉపాసన చేసి, హరిహరరాయలు మరియు బుక్కరాయలు అనే రాజుల ఆధ్వర్యంలో విజయనగర సామ్రాజ్య స్థాపన జరిపించినట్లు చరిత్రలో ఉన్నది.

విద్యారణ్య స్వామి (పూర్వాశ్రమంలో వారి పేరు మాధవా చార్యుడు) శృంగేరి శారదా మఠానికి 12వ పీఠాధిపతి. శంకరాచార్యుల తరువాత ఐదు శతాబ్దాలకు (1380-1386) శారదా పీఠాన్ని అధిరోహించాడు. విజయనగర సామ్రాజ్య స్థాపనకు మూల ప్రేరకునిగా ప్రసిద్ధి చెందాడు.



తన ప్రగాఢమైన ఆధ్యాత్మిక జ్ఞానం మరియు రాజకీయ చతురత ద్వారా, శ్రీ విద్యారణ్య స్వామి దక్షిణ భారతదేశంలో శక్తివంతమైన విజయనగర సామ్రాజ్య స్థాపనలో కీలక పాత్ర పోషించారు.

హరిహరరాయలు, బుక్కరాయలు శ్రీ విద్యారణ్యుని సలహాను అనుసరించి శ్రీ లక్ష్మీ దేవిని పంచదశీ యుక్త బీజ సంపుటిత శ్రీ సూక్త విధానం లో ఉపాసన చేసినట్టు చరిత్రలో చెప్పబడినది.

శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య స్వామి వారు ఉపాసించిన సంపుటిత శ్రీ సూక్తవిధానము గురించి ఇక్కడ తెలియజేయబడుతున్నది.

## వినియోగించబడిన మంత్రములు

1. మహా లక్ష్మీ మంత్రము
   ఓం శ్రీం హ్రీం శ్రీం కమలే కమలాలయే ప్రసీద ప్రసీద శ్రీం హ్రీం శ్రీం ఓం మహా లక్ష్మ్యై నమః

2. దుర్గా సప్త శ్లోకీ లోని మంత్రము
   ఓం దుర్గే స్మృతా హరసి భీతి మశేష జంతోః
   స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాశి
   దారిద్ర్య దుఃఖ భయ కారిణి కాత్వదన్యా
   సర్వోపకార కరణాయ సదార్ద్ర చిత్తా

3. శ్రీ సూక్తము

4. సౌభాగ్య పంచదశి
   ఐం క ఏ ఈ ల హ్రీం క్లీం హ స క హ ల హ్రీం సౌః స క ల హ్రీం

పంచదశి యుక్త శ్రీ లక్ష్మీ సూక్త విధానమును ప్రతి నిత్యము ఒక పారాయణము గానీ లేక 15 పారాయణములు చేయుచూ, శ్రీదేవీ సంబంధిత యంత్రమునకైనా లేదా లక్ష్మీ దేవికిన్నీ, క్షీరములు, గంధోదక, ఫలోదక, శుద్ధోదకములతో గాని అభిషేకించి, నివేదన, పంచోపచార పూజలు, లక్ష్మీ సూక్త స్థిత నామార్చనమొనర్చి, మహానివేదన, ఉత్తర న్యాసం, పునః పూజ, శ్రీ దేవీ అర్పణం చేయవలయును. అట్లు పదిహేను మాసములు చేసిన భక్తుడు అఖండైశ్వర్యమును పొంది, యావజ్జీవాంతములు సమస్త బోగములు అనుభవించి శివ సాయుజ్యమును పొందును. పై విధానమును నవరాత్రముల యందు ఏకోత్తర వృద్ధి పారాయణము చేయుట చేత కోటానుకోట్ల జన్మములనుండి వచ్చుచుండు మహా దరిద్రమును సమస్తము నశింపజేయును.

పూర్తి వివరములు కలిగి ఉన్న సంపుటిత శ్రీ సూక్త విధానము ఫైల్ ని srimeru.org నుంచి డౌన్లోడ్ చేసుకోగలరు.



# అశ్వరూఢాంబికా అమ్మ వారి ఆలయం (గుర్రాలక్క గుడి)

సుప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ అంతర్వేది క్షేత్రమందు శ్రీ నరసింహ స్వామి కొలువై ఉన్నాడు. ఈ క్షేత్ర మహాత్యము 3వ అధ్యాయమునందు గుఱ్ఱాలక్క గురించిన ప్రస్తావన ఉన్నది.

వశిష్టుడు తన కుటుంబంతో సహా గోదావరి తోక భాగంలో ఇక్కడే ఉండేవాడని పురాణాలలో చెప్పబడింది. వశిష్ఠుడు నివసించిన చోట గోదావరి నది నుండి వచ్చిన శాఖను వశిష్ఠ గౌతమి అని పిలుస్తారు.

గోదావరి నది, నాసిక్‌లో ఆవు తల వలె మరియు అంతర్వేదిలో తోక చివరి బాగమును పోలి ఉండి, పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ఆవు పేడలో లక్ష్మి ఉంటుంది అని శాస్త్రం చెబుతున్నది. అందువల్ల ఇక్కడి ప్రదేశం చాలా సంపన్నమైన మరియు ఆధ్యాత్మిక ప్రదేశంగా పరిగణించబడుతున్నది.


విశ్వామిత్రుని రాక్షసులు, వశిష్టుని పిల్లలను నిరంతరం చంపుతూనే ఉన్నారు. వశిష్టుడు, ఆ రాక్షసుల బారి నుండి తనను, తన పరివారాన్ని రక్షించమని, లక్ష్మీ నరసింహుడిని ప్రార్థించాడు. అప్పుడులక్ష్మీ నరసింహుడు యుద్ధానికి వచ్చాడు.

అతి క్రూరుడైన రత్నలోచనుడనే రాక్షసుడు, యుద్ధము చేసినప్పుడు తన రక్తబిందువులచే ఎన్ని ఇసుక రేణువులు తడుస్తాయో, అంతమంది తనతో సమానమైన బలం కలిగిన వారు జన్మించి తన వంశం వృద్ధి చెందాలని రత్నలోచనుడు వరం పొందియున్న కారణం చేత, అహంకారముతో శ్రీహరితో యుద్ధం చేశాడు. శ్రీ నరసింహ స్వామి అవతారంతో ఉన్న శ్రీహరి, ఆతని ఎన్నిమారులు సంహరించిననూ, వర ప్రభావముచే రత్నలోచనుని దేహము నుండి భూమిపై పడిన రక్త బిందువులు ఆ దానవునితో దీటైన రక్కసులుగ రూపొంది శ్రీహరిపై మరల దాడి చేశారు.

అప్పుడు శ్రీహరి రత్నలోచనుని రక్తము నేలపై బడకుండా త్రాగుటకై, మాయాశక్తిని సృష్టించినాడు. ఆ విధంగా, పార్వతీ దేవి అంశతో సృష్టింపబడ్డ మాయాశక్తి, గుఱ్ఱం మీద వచ్చి, ఆ రాక్షసుడి రక్తం నేలమీద పడకుండా ఉండే విధంగా, తన నాలుకను రణరంగ ప్రాంతమంతా వ్యాపింపజేసి, క్రింద పడుతున్న రక్తాన్ని మొత్తం త్రాగి వేసింది.

చివరిగా శ్రీహరి తన చక్రముతో ఆ రాక్షసుని శిరస్సు ఖండించిన తరువాత ఆ చక్రమును కడిగిన ప్రదేశము చక్ర తీర్థము అనే పేరుతో భక్తులను సకల దోషముల నుండి విముక్తులను గావించుచున్నది.

గుఱ్ఱం మీద వచ్చిన దేవీ శక్తి కనుక ఆమెను అశ్వారూఢాంబ అని భక్తులు పిలుచుకుంటున్నారు. ఈమె పార్వతీ దేవి అంశ. అశ్వారూఢాధిష్ఠితాశ్వా కోటి కోటి భిరావృతా అని లలితా సహస్రనామంలో కూడా అమ్మవారి నామం ఉన్నది. వ్యావహారికంగా, గుఱ్ఱమునెక్కి వచ్చిన నరసింహ స్వామి సోదరి కనుక, గుఱ్ఱాలక్క అని కూడా పిలుచుకుంటున్నారు.



అశ్వరూఢాంబికా దేవి యొక్క గర్భగుడి

శ్రీహరి సృష్టించిన మాయాశక్తి, రత్నలోచనుని సంహరించిన తరువాత, తాను త్రాగిన ఆ దానవుని రక్తమునంతయూ ఒక నిర్జన ప్రదేశమున విడిచి వేసెను. ఆ రుధిరము మహా నదివలె ప్రవహించి, క్షేత్ర ఉత్తర భాగమున సాగరమున విలీనమైపోయినది. అలా విలీనమైన ప్రాంతము రక్త కుల్యానది అని పేరు గాంచినది. రక్త కుల్యానదీ స్నానమాచరించిన వారి పాపములు పటాపంచలు అగును, భూత, ప్రేత పిశాచాదుల పీడ తొలగిపోవును. దుష్ట గ్రహములు స్వామిని సమీపించకుండా ఈ నది అవరోధించును. ఇక్కడి దర్శనం వ్యక్తి ఆరోగ్యం, సంపద మరియు అతని సంతానం కోసం సహాయపడుతుందని చెబుతారు.

శ్రీహరి సృష్టించిన మాయాశక్తి, రత్నలోచనుని సంహరించిన తరువాత, తాను త్రాగిన ఆ దానవుని రక్తమునంతయూ ఒక నిర్జన ప్రదేశమున విడిచి వేసెను. ఆ రుధిరము మహా నదివలె ప్రవహించి, క్షేత్ర ఉత్తర భాగమున సాగరమున విలీనమైపోయినది. అలా విలీనమైన ప్రాంతము రక్త కుల్యానది అని పేరు గాంచినది. రక్త కుల్యానదీ స్నానమాచరించిన వారి పాపములు పటాపంచలు అగును, భూత, ప్రేత పిశాచాదుల పీడ తొలగిపోవును. దుష్ట గ్రహములు స్వామిని సమీపించకుండా ఈ నది అవరోధించును. ఇక్కడి దర్శనం వ్యక్తి ఆరోగ్యం, సంపద మరియు అతని సంతానం కోసం సహాయపడుతుందని చెబుతారు.

క్రీ.శ. 1822 ప్రాంతంలో కీ.శే. కొపనాతి కృష్ణమ్మ గారు ఈ గుఱ్ఱాలక్క గుడి నిర్మాణం పూర్తి చేయించారు.

మార్గ శుద్ధ దశమినాడు అంతర్వేదిలోనున్న శ్రీ నరసింహ స్వామి వారికి కల్యాణం జరుగుతుంది. ఆ మరునాడు, అనగా ఏకాదశి నాడు, చీరె సారెలతో స్వామి వారు, ఊరేగింపుగా రథం మీద, గుఱ్ఱాలక్క గుడికి వస్తారు. గుడికి వచ్చి, సోదరికి చీరె, సారె సమర్పించుకుంటారు. “ప్రతి ఏటా నీకు వివాహమా!” అని అంటూ అమ్మవారు మూతి ముడుచుకుందట. దీనికి నిదర్శనంగా, ఇక్కడ అమ్మవారి విగ్రహం కూడా మూతి పక్కకు తిప్పుకుని ఉంటుంది. ఇంతకంటే చరిత్రకు తార్కాణం ఏమి ఉంటుంది?

అప్పుడు స్వామి వారు, “అంతర్వేది వచ్చిన భక్తులందరినీ నీ వద్దకు పంపుతాను” అని, తన సోదరికి వాగ్దానం చేస్తాడట.

ఈ గుడిలో శరన్నవరాత్రులు చాలా వైభవంగా చేస్తారు. ఈ కార్యక్రమాలకు కావలసిన పూజా సామాగ్రి అంతా శ్రీ నరసింహ స్వామి ఆలయం నుండే వస్తాయి. రథ సప్తమి నుండి పౌర్ణమి వరకు స్వామి వారికి జరిగిన విధంగానే గుఱ్ఱాలక్క అమ్మవారికి కూడా విశేషంగా పూజలు జరుగుతాయి.

గుఱ్ఱాలక్క అమ్మవారు చాలా మహిమ గలిగిన దేవత. అంతర్వేది వచ్చినప్పుడు,నరసింహస్వామి ఆలయంతోబాటు, శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, గుఱ్ఱాలక్క గుడి, వశిష్ఠాది సప్త ఋషుల ఆలయం - తప్పనిసరిగా దర్శనం చేసుకోవలసిన స్థలములు. ఈ ఆలయాలు అన్నీ దర్శిస్తే అంతర్వేది యాత్ర పూర్తి అయినట్లు లెక్క.

అశ్వారూఢాంబా దేవి సమక్షంలో ఖడ్గమాల, లలితా సహస్ర నామము, చదివినచో మంచి ఫలితం ఉంటుంది.

ఓం ఆం హ్రీం క్రోం ఏహి పరమేశ్వరి స్వాహా

అన్న అశ్వారూఢా మంత్రము ఈ ఆలయ ప్రాంగణంలో చదివితే, అమ్మ కరుణిస్తుంది. అశ్వములు ఇంద్రియములకు ప్రతీకలు కాబట్టి, ఆ అశ్వములకు అధిష్టాన దేవత అయిన అశ్వారూఢ, భక్తులకు ఇంద్రియ నిగ్రహాన్ని ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. మరియు అశ్వములు చైతన్యానికి కూడా సంకేతము కనుక, అశ్వారూఢా మంత్రాన్ని ఇక్కడ సాధన చేసిన వారికి నిత్యచైతన్యం కూడా లబిస్తుంది.

అయిదు విషయాలలో ఈ ప్రాంతం ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

1. సముద్ర తీరం
2. గోదావరీ నది యొక్క సాగర సంగమం
3. వశిష్ఠ నదీ పాయ
4. రక్త తుల్యా నది
5. చక్ర తీర్థం
6.

ఈ అయిదింటిలోనూ స్నానం చేసి దానములు చేసిన వారికి పునర్జన్మ ఉండదని నమ్మకం. ఇక్కడే పితృదేవతలకు పిండప్రదానములు చేయుట ఉత్తమం.

ఈ విధంగా ఒకే క్షేత్రమునందు అనేక ఫలితములందజేసే గొప్ప క్షేత్రము అయిన అంతర్వేది క్షేత్రమునందు ముఖ్య దేవతలు శ్రీ నరసింహ స్వామి మరియు అశ్వారూఢాంబా దేవి.

**చేరుకునే మార్గములు**

ఈ స్థలమునకు చేరడానికి రైలు, రోడ్డు, విమాన మార్గముల ద్వారా చేరవచ్చును.

1. దగ్గరగా ఉన్న విమానాశ్రయము 115 కి.మీ. దూరంలో గల రాజమండ్రి విమానాశ్రయము. రాజమండ్రి నుండి బస్సులో అంతర్వేది చేరుకోవచ్చును.
2. భీమవరం రైల్వేస్టేషన్ నుండి 55 కి.మీ. దూరంలో అంతర్వేది క్షేత్రము గలదు.
3. అంతర్వేది క్షేత్రము నుండి గుఱ్ఱాలక్క గుడి షుమారు 2 కి.మీ. దూరంలో ఉంటుంది.

గుఱ్ఱాలక్క గుడికి సంబంధించిన పురోహితుల వారిని ఫోన్ నంబర్ – 79812 88260 మరియు 92913 32101 ల ద్వారా సంప్రదించవచ్చును. వారితో తెలుగులో మాత్రమే మాట్లడవలసి ఉంటుంది.



# రక్త సంబంధిత సమస్యలకు నివారణోపాయము

మనలో కొంతమంది రక్త సంబంధమైన అనారోగ్యములు కలుగుతూ ఉంటాయి. ఉదాహరణకి, రక్త లేమి, బ్లడ్ ప్రెషర్, రక్త మాలిన్యము( infection) మొదలైనవి. వీటికి లలితా సహస్రనామంలో అద్భుతమైన పరిహారము కలదు. అది దిగువ ఇవ్వబడుతున్నది.

లలితా సహస్రనామంలో 365 వాక్యములు కలవు. ఇందులో ప్రతి వాక్యమూ ఏదో ఒక సమస్యకు నివారణోపాయముగా పని చేస్తుంది. రక్త సంబంధిత సమస్యలకు "దంష్ట్రోజ్వలా అక్షమాలాది ధరా రుధిర సంస్థితా" అన్న వాక్యము సహస్రనామముతో సంపుటీకరణ చేసి చదువుతూ ఒక ప్రక్రియ చేస్తే గొప్ప ఫలితాలను పొందవచ్చును.

అది ఎలాగంటే, రాగి గ్లాసును తీసుకుని, అందులో శుద్ధ జలమును పోసి, చిటికెడు వీభూది వేసి, ఒక రాగి ఉద్ధరిణితో బాగా కలపాలి. సంబంధిత వాక్యము సంపుటీకరణ చేయబడిన ఆడియో ఫైల్ లింక్ దీనితో జత పరచ బడినది. ఈ ఆడియో ఫైల్ ను వింటూ,రాగి ఉద్ధరిణి తో, రాగి గ్లాసులోని నీటిని కొంచెం పైకి తీసుకుని, మరలా అందులోనే పోస్తూ ఉండాలి. ఇలా పదే పదే చేస్తూ ఈ ఆడియో ఫైల్ ను వినాలి.

దీని ఉద్దేశము ఏమిటంటే, సంపుటీకరణలోని ఆధ్యాత్మిక ప్రకంపనాలు జలములో ప్రవేశ పెట్టుటయే. దీని ద్వారా ఆ జలము తీర్థము అవుతుంది. ఆడియో ఫైల్ పూర్తి అయిన తరువాత ఆ తీర్థమును పూర్తిగా త్రాగాలి. ఇది ఒక ఔషధం వంటిది. ఈ ప్రక్రియకు ప్రతి దినము 90 నిముషములు పడుతుంది. ఇలా 90 రోజుల పాటు విడువకుండా చేయాలి. స్త్రీలు బహిష్టు సమయంలో కూడా చేయవచ్చును. ఎందుకంటే ఇది నివారణ కొరకు మాత్రమే ఉద్దేశింపబడినది. పూజ నిమిత్తము కాదు.

చాలామందికి ఈ పరిహారము అద్భుత ఫలితాలను ఇచ్చినది కావున, దీనిని వినియోగించుకుని, ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులవుదురు గాక.

దంష్ట్రోజ్వలా అక్షమాలాది ధరా రుధిర సంస్థితా" అన్న వాక్యము ఆడియో ఫైల్ లింక్
srimeru.org website నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చును.

## ఉత్సవాలు, కార్యక్రమాలు

1-01-2023
నూతన సంవత్సరం సందర్భంగా పీఠంలో ఉన్న సాధకులు, వంటవారు, పనివారు అందరి చేత, గురువు గారు పూజించే విగ్రహములకు అభిషేకము చేయించబడింది.

3-01-2023
జ్ఞాన పీఠము నందు గురుమండల పూజ నిర్వహించబడింది.

8-01-2023
ఏకాదశి నాడు, కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వారు సిద్ధి పొందిన రోజు సందర్భంగా జ్ఞానపీఠమునందు అందరూ "హర హర శంకర జయ జయ శంకర" జపము చేశారు.

13-01-2023
పీఠమునందు కృష్ణ పూజ మరియు గురుమండల పూజ గురువు గారిచే నిర్వహించబడినవి.

14-01-2024
పీఠమునందు, సాంప్రదాయ పద్ధతి ప్రకారం భోగి మంటలు, నృత్యములు నిర్వహించబడినవి.

15-01-2023
పీఠమునందు సంక్రాంతి సంబరాలు జరుపబడినవి.

22-01-2023 to 30-01-2023
జ్ఞాన పీఠమునందు, 9 రోజుల పాటు శ్యామలా గుప్త నవరాత్రులు , హోమములు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా సాధకులు, సోదరి శాశ్వత గారు నాట్యోపచారము చేశారు.

26-01-2023
జ్ఞానపీఠమునందు వసంత పంచమి ఉత్సవము జరుపబడినది.

28-01-2023
జ్ఞానపీఠమునందు రథ సప్తమి పూజలు నిర్వహించబడినవి.

30-01-2023
9వ రోజు శ్యామా నవరాత్రి ఉత్సవము నిర్వహించబడినది.













# రాబోయే కార్యక్రమాలు



## గురూజీ పర్యటన వివరాలు

గురూజీ పర్యటన వివరాలు టెలిగ్రామ్ గ్రూప్‌లో షేర్ చేయబడతాయి. అప్పాయింట్ మెంట్ కొరకు +91 8088256632 నంబరుకు మెసేజ్ పంపగలరు.

## పీఠంలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 5: మాఘ పౌర్ణమి

## శ్రీ విద్యా తరగతులు



### మాడ్యూల్ 5 & 6

ఇంగ్లీష్: 5th & 6th ఫిబ్రవరి.
తెలుగు: 12th & 13th ఫిబ్రవరి.

### మాడ్యూల్ 7

ఇంగ్లీష్: 18th ఫిబ్రవరి.
తెలుగు: 19th ఫిబ్రవరి.

### మాడ్యూల్ 1 & 2

ఇంగ్లీష్: 10th, 11th & 12th మార్చ్, 5 pm - 9 pm.
తెలుగు: 17th, 18th & 19th మార్చ్, 5 pm - 9 pm.

Registration: https://srimeru.org/srividya-saadhana

### మాడ్యూల్ 3 & 4

ఇంగ్లీష్: 20th & 21st జనవరి.
తెలుగు: 3rd & 4th ఫిబ్రవరి.

సంపుటి -1 సంచిక - 5

# గురూజీతో నా అనుభవాలు

శ్రీ దొరైరాజ్



**శ్రీ మాత్రే నమః**

శ్రీ మాత్రే నమః. నేను 16 నెలల క్రితం గురు కరుణామయ మార్గదర్శకత్వంలో శ్రీవిద్యా సాధనను ప్రారంభించాను మరియు అప్పటి నుండి నాది ఆనందకరమైన ప్రయాణం.

శ్రీవిద్యను అభ్యసించే పెద్దలు కాని కుటుంబ నేపథ్యం కాని నాకు లేదు. కొన్ని దశాబ్దాల క్రితం శ్రీవిద్య గురించి ఎవరో ప్రస్తావించారు తప్ప నేను దాని గురించి వినలేదు. శ్రీవిద్యా సంప్రదాయంతో అమ్మవారి అనుబంధం తెలియక మా అమ్మ తొలినాళ్ల నుంచి రాజరాజేశ్వరిని పూజించేది. నేను చిన్నప్పటి నుండి దేవి పూజలో నిమగ్నమై ఉండేవాడిని. శ్రీవిద్య గురించి తెలియకుండానే లలితా సహస్రనామం, శ్రీ సూక్తం, దుర్గా సప్తశతి మొదలైన అమ్మవారి వివిధ శ్లోకాలను పఠించేవాడిని.

అప్పుడు హఠాత్తుగా నేను దశాబ్దాల క్రితం విన్న "శ్రీవిద్య" అనే పదం గుర్తుకు వచ్చింది. అప్పుడే నేను శ్రీవిద్యను నేర్చుకోవాలి అని అనుకుని, శ్రీవిద్య నేర్చుకోవడానికి నా అన్వేషణ ప్రారంభించాను. నాకు మార్గనిర్దేశం చేయమని మరియు నాకు శ్రీవిద్యకు దీక్ష ఇవ్వగల గురువును చూపించమని, కంచి మహాపెరియవార్ (కంచి కామకోటి పీఠం యొక్క పరమాచార్య చద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి) స్వామిని నేను ప్రార్థించాను.

ఆ క్షణమే నాకు గురు కరుణామయ గురించి తెలిసింది. గురు కరుణామయ యొక్క కొన్ని వీడియోలను చూడటం ప్రారంభించాను. నేను దీక్షను పొందవలసిన గురువు కరుణామయ గురువే అని నాకు చాలా తక్కువ సమయంలోనే అర్థమైంది. నేను కొన్ని వారాల పాటు దీని గురించి ఆలోచించి, మహాపెరియవార్ ని ప్రార్థిస్తూ, అన్ని శుభ శకునాలు చూసి, బెంగళూరులోని శ్రీవిద్యా లెర్నింగ్ సెంటర్‌కు కాల్ చేసి, ఆగస్ట్ 2021లో మొదటి మాడ్యూల్స్ కోసం నమోదు చేసుకున్నాను.

గురు కరుణామయ యొక్క శ్రీవిద్యా తరగతులలో కుల మతాలకు అతీతంగా సమాజంలోని వివిధ వర్గాల నుండి ప్రపంచవ్యాప్తంగా శిష్యులు ఉన్నారు. తరగతులు వివరణతో పాటు ఆచరించవలసిన జీవన విధానాల పాఠ్యాంశాలు ఉంటాయి. ప్రత్యేకతలకు వస్తే, ఆచారాలను ఆసక్తికరంగా మార్చేది ఏమిటంటే, వీటి వెనుక ఉన్న అర్థం మరియు హేతువుపై గురు కరుణామయ ఇచ్చిన లోతైన వివరణ. ఒక ఉదాహరణ చెప్పాలంటే, మనకు ఈ జ్ఞానాన్ని అందించిన గురువులు, దేవతలు, పూర్వీకులందరికీ "ధన్యవాదాలు" తెలుపుతూ వివిధ తర్పణాలు నిర్వహించబడతాయి. ఆచారాల వెనుక ఉన్న తత్వం గురించిన వివరణతో, ఇవి ప్రాపంచిక చర్యగా కాకుండా ఆనందదాయకంగా మరియు అర్థవంతంగా మారతాయి.

నా వ్యక్తిగత అనుభవాల విషయానికి వస్తే, 2021 నా మొత్తం జీవితంలో అత్యంత సవాలుతో కూడుకున్న సంవత్సరం. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌లో ఉన్న నా టీనేజ్ కొడుకుకు సంవత్సరం ప్రారంభం నుండి పెద్ద సమస్యలు ఉన్నాయి. ఈ సవాళ్లు నా ముందున్నందున, శ్రీవిద్యా ప్రయాణంలో నన్ను తీసుకెళ్లమని అమ్మను ప్రార్థించాను. తల్లి దయతో, నా అభ్యాసానికి ఎటువంటి ఆటంకాలు లేవు. మరియు నేను నెమ్మదిగా మాడ్యూల్ 1, 2 పూర్తి చేసి, తరువాతి స్థాయి మాడ్యూల్స్‌కు చేరుకున్నాను. కొంత కాలంగా, నేను శాంతియుతంగా, ఎక్కువ ఓపికగా కనిపిస్తున్నానని, కోపం తగ్గుతున్నదని నా భార్య వ్యాఖ్యానించింది. నేను ఏ కార్యకలాపాన్ని చేసినా, నాకు మార్గనిర్దేశం చేయడానికి నేను దానిని జగన్మాతకు వదిలివేసాను మరియు నేను సవాలుగా భావించిన అనేక పరిస్థితులను సజావుగా సాగేలా చూడగలిగాను. నేను చేసేది ఏదైనా తుది ఫలితం గురించి తక్కువ చింతించటం మొదలుపెట్టాను కానీ ఆ మొత్తం ప్రక్రియను ఆస్వాదించాను.

మే 2022లో (ఇది 2021లో ఊహించలేనిది) నేను నా కొడుకు ఉపనయనం నిర్వహించ గలిగేలా నా కొడుకు పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. మరియు నన్ను చూస్తూ అతను కొన్ని మంత్రాలను చదవడం ప్రారంభించాడు. సహజంగానే శ్రీవిద్యను అభ్యసించడం వల్ల ఒత్తిడి తగ్గడం, నా శ్వాస సమయంలో నేను సులభంగా గమనించగలిగే ఆందోళన వంటి ఇతర ప్రయోజనాలు ఉన్నాయి.

నేను గురుగీత 1:75 నుండి ఉటంకిస్తూ ముగించాలనుకుంటున్నాను

**"అనేక-జన్మ-సంప్రాప్త-కర్మ బంధ -విదాహినే |---జ్ఞాననాల ప్రభవేన తస్మై శ్రీ-గురవే నమ"**

అంటే "ఆత్మజ్ఞానం అనే అగ్నిని ప్రసాదించడం ద్వారా జీవిత కాలాలలో పేరుకుపోయిన కర్మను కాల్చివేసే గురువుకు నమస్కారాలు"




పిల్లలకి పేర్లు పెట్టే విషయంలో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి? పేరు ప్రభావము జీవితము మీద ఎలా ఉంటుంది?

పిల్లలకి పేరు పెట్టడములో పూర్వ కాలంలో పాటించే విధానము ముందు చూద్దాము. చిన్న పిల్లలకు వారి పెద్దవాళ్ళ పేర్లు పెట్టడము ఆనవాయితీగా ఉండేది. తాతగారి పేరు పెట్టారు అనుకుందాము. ఆ పేరు పిల్చినప్పుడల్లా తాతగారికి కనెక్ట్ అవుతూ ఉంటారు. ఆయన పై గౌరవం వలన పిల్లవాడిని నోటికి వచ్చినట్టు తిట్టకుండా ఉంటారు. కాస్త గౌరవంగా చూసుకుంటారు. ఆ తాతగారికి ఉన్నటువంటి పేరు, ప్రఖ్యాతులు, ఆ శక్తి, ఈ పేరు పిలవడం వల్ల సదా మననం అవుతూ ఉంటుంది. భగవంతుడిని మననం చేసుకుంటే ఏ విధముగా ఆ శక్తి మనకు కొంత చేరుతుందో ఆ తాతగారి పేరు చెప్పి చెప్పి చెప్పి కొంత వరకు పిల్లవాడికి ఆయన శక్తి చేరుతుంది. అది ఒక పద్ధతి.

'ప్రాణ ప్రయాణ సమయే నారాయణ శబ్ద మాత్రేణ పునర్జన్మ నశ్యతి' అంటారు. ప్రాణం పోతూ ఉన్నప్పుడు, సాధారణంగా కుమారుడిని పిలుస్తారు. 'నారాయణ' అని కుమారుడికి పేరు పెట్టుకున్నారు అనుకోండి. అలా నారాయణా అంటూ ప్రాణం పోతే వాడికి ఇంకో జన్మ లేదు అంటుంది శాస్త్రం. అలాగే లక్ష్మి, సరస్వతి, కృష్ణవేణి అని పిల్చుకుంటుంటే ఎన్ని వేల సార్లు పిల్లలని పిలుస్తారో తల్లితండ్రులకి అన్ని సార్లు దైవ నామము జపం అయినట్టే కదా! అందుచేత, భగవత్ పరంగా పేర్లు పెట్టినప్పుడు, ఆ పేరు పిలిచి, పిలిచి వీళ్ళ జన్మ ధన్యం అయిపోతుంది. ఆ శక్తి పిల్లలకి కూడా కొంత వెళుతుంది. ఇది రెండవ పద్ధతి.

సాధారణంగా నామకరణం సమయములో మాసనామ్నా, నక్షత్ర నామ్నా, వ్యావహారిక నామ్నా అని మూడు పేర్లు వ్రాస్తారు. అలా కాకుండా ఇంటర్ నెట్ లో వెతికి, ఎవ్వరికీ అర్థం కాని పేరు పెట్టటం ఇప్పటి తరానికి ఆసక్తికరంగా ఉన్నది. దాని అర్థము ఏమిటో తెలీదు. అలా అర్థము తెలియని పేర్లు పెట్టుకున్నట్టయితే ఏ తార్కికమైన ఉపయోగము ఉండదు.

## ధర్మ సందేహాలు

పరాయి దేశాల్లో ఉన్నవాళ్లు కొంతమంది మన పేర్లు వాళ్ళు పలకలేరు అని విదేశీయుల కోసం వీలైన పేర్లు పెట్టే మహానుభావులు కూడా ఉన్నారు. ఒకరి పేరు శ్రీనివాస్. వాళ్ళు పలకలేరు అని, 'నాష్' అని మార్చుకున్నారు. నాష్ అంటే అర్థం నాశనం. మరి career లో అభివృద్ధి ఎలా ఉంటుందండీ. శ్రీనివాస్ అని చక్కని పేరు పెట్టుకుని, వాడు పలకకపోతే అది వాడి కర్మ. మనము ఎందుకు మార్చుకోవాలి? వాళ్ళు మార్చుకుంటున్నారా? వాళ్లకి చాలా కష్టమైన పదాలు ఉంటాయి, నేను పలకట్లేదు అని మార్చుకోవట్లేదే! అందుచేత ఇది గమనించాలి. ఒక్కొక్క అక్షరం పలికేటప్పుడు, ఒక్కొక్క శక్తి వస్తుంది.

శక్తి వంతమైన ఐదు అక్షరాలు ఉన్నాయి. ఈ అక్షరాలు పేరులో ఉండటము వలన ఆయా శక్తులు పొందుతూ ఉండవచ్చు.
స - అంటే జ్ఞానము - సరస్వతి. స-రసవతి ఇతి సరస్వతి. రసో వై సః. అని కదా ఆనందాన్ని నిర్వచించారు. స అనే అక్షరం మీ పేరులో ఉంటే అది పిలిచిన అందువల్ల ఆనందం వస్తుంది.
ర - అంటే అగ్ని బీజం. ర్ర అని పలికినప్పుడు ఘర్షణ ఏర్పడుతుంది. అగ్ని వల్ల చైతన్యం, జ్ఞానం లభిస్తాయి.
త - నాలికతో, త - అంటే తరింపచేసేది, అంటే ఉద్ధరించేటటువంటి శక్తి . ఈ ప్రాపంచికంలో ఉన్న వాడిని కాస్త ఆద్యాత్మికం వైపు తీసుకుని వెళుతుంది.
స, ర, త – ఈ అక్షరాలు పలికేటప్పుడు నాలిక ఒకే విధంగా కదలటం లేదు. వేరు వేరు విధాలుగా నాలుక కదిలినందువల్ల, కొన్ని నాడులు ఉత్తేజం అవుతూ ఉంటాయి. ఆ విధంగా, ఆ పదం పలికినప్పుడు కొంత శక్తి ఉద్భవిస్తుంది.
వ - అన్నది అమృత బీజం. నాశనం లేనటువంటి జ్ఞానము, నాశనం లేనటువంటి ఆనందం, ఇటువంటివన్ని వస్తాయి.
మ - మ అన్నప్పుడు పెదాలు కలుస్తున్నాయి. మ అన్నది మాయ. ఈ అక్షరం పలికినప్పుడు మాయను జయించే శక్తి లభిస్తుంది.

పుట్టిన నక్షత్రాలని బట్టి పేరులో కొన్ని అక్షరాలు ఉండాలి అంటారు. అశ్వని నక్షత్రం ఉంటే, చు, చే, లో, ల - దానితోటి పేరు మొదలు అవ్వాలి. ఆ అక్షరం తో పేరు వెతికి, ఏదో బలహీనమైన పేరు పెట్టుకుంటున్నారు.

ఈ నక్షత్రాన్ని బట్టి పేరు పెట్టుకోవటము అన్నది ఏర్పడటానికి కూడా ఒక కారణము ఊహించవచ్చు. జన్మించిన తిథి వార నక్షత్రాలు గుర్తు ఉంచుకొనలేని పామరులకు సహితము వారి జన్మ కుండలిని చూడవలసిన సమయాలలో సరైన సమాచారము సిద్ధముగా ఉంచాలి అనే ఉద్దేశ్యంతో ఏర్పరచబడిన విధానము. పేరులోని మొదటి అక్షరాన్ని బట్టి వారి జన్మ నక్షత్రాన్ని  రివర్స్ కాలిక్యులేషన్ చెయ్యవచ్చు. లేదా పెళ్లి ఎప్పుడు అయింది? పిల్లలు ఎప్పుడు పుట్టారు? అవి పెట్టుకుని calculate చేస్తారు. అంతేకాని, నక్షత్రాన్ని అనుసరించి పేరు అనేది నాకు తెలిసినంతవరకూ అంత ముఖ్యమైనది కాదు. దాని మీద ఆధార పడవలసిన అవసరము లేదు. ఆధారపడితే మరీ మంచిది.

దైవ పరమైనటువంటి పదం దాని కన్నా ముఖ్యం. నక్షత్ర నామ్నా, మాస నామ్నా అన్న సమయములో ఎప్పుడూ దేవుడి పేర్లే ఉంటాయి. మీరు చూస్తే list ఉంటుంది. ఈ నెలలో పుట్టిన వారందరికీ అదే పేరు. చైత్ర మాసంలో పుడితే ఒకటి. మాఘ మాసంలో పుడితే ఒకటి. అందరికి అదే పేరు. నక్షత్ర నామం అంటే, అశ్విని నక్షత్రంలో పుడితే ఇదే పేరు. అది రాసాక, వ్యావహారిక నామ్నా అని చెప్పి ఈ పేరు రాస్తారు. అది మనం పద్ధతి పాటిస్తే తెలుస్తుంది. అందుచేత, పేరు పెట్టేటప్పుడు, దాన్ని పిల్చినందువల్ల నాకు జన్మ తరించాలి, ఆ పలికిన శబ్దం వల్ల పిల్లవాడికి కూడా మంచి జరగాలి. పైన చెప్పినట్టు స, ర, త, వ, మ, ఆ ఐదు అక్షరాలు ఉంటే చాలా విశేషం. అయినప్పటికీ పేరు ఒక్కటీ బావుంటే సరిపోదు. వాళ్ళు చేసుకున్న కర్మల పై వారి జీవితాలు నడుస్తూ ఉంటాయి. కాకపోతే, సప్లిమెంటల్ ఎనర్జీ మాత్రం పేరుతో తప్పక వస్తుంది. దాంట్లో సందేహమే లేదు.

అందుచేత, పేరు పెట్టే సమయములో స, ర, త, వ, మ - లలో వీలైనన్ని అక్షరాలు పేరులో ఉండే విధముగా, అవి అర్ధవంతమైన మరియూ భగవంతునికి సంబంధించిన పేర్లు ఎంచుకుంటే వాళ్ళ జీవితం చక్కగా ఉంటుంది. వాళ్ళని పిలిచి, పిలిచి మన జన్మ కూడా ధన్యం అవుతుంది, సందేహం లేదు.

సూక్తి

**వెనుకకు తిరిగి, లోపలకు ప్రయాణించు.**
**జీవితం మారిపోతుంది.**

~ శ్రీ గురు కరుణామయ

gurunvaani

Srividya Learning Centre
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org